స్వరం పౌరుషంగా మార్చి చెప్పాడు గోపయ్య.

''సర్లే..నీవెళ్ళు'' ఎందుకైనా మంచిది గోపయ్యను పంపించి వేశాడు పరమానందం.

ఒక నెల..రెండునెలలు..మూడు నెలలు గడిచినా అప్పు తాలూకు వాయిదాలు పైసా జమ కాకపోవడమే కాకుండా పశువులను తీసుకు రాకపోవడంతో అందరినీ పిల్చి వార్నింగ్ ఇచ్చి కారణం అడిగాడు పరమానందం.

''ఏం సేయమంటారు సారూ..రోజూ ఆకొండ చరియ నుండి మీ బ్యాంకు వరకు నడిసి కాళ్ళు నెప్పెడుతున్నాయని మొత్తుకొని, పశువులన్నీ కొండవతలకి ఇక రామని సెప్పి వెళ్ళిపోయినాయి. అవే మన దగ్గర లేకుంటే డబ్బులు యాడ నుండి తెచ్చి కడ్తాం సారూ?!'' జనం అంతా ఏకకంఠంతో అన్నారు.

పరమానందానికి అసలేం అర్థం కాక అయోమయంగా ''అదేంటి వాటికి కాళ్ళు నెప్పులని మీతో ఎవరు చెప్పారు?'' ఆవేశం కూడదీసుకొని అడిగాడు.

''మనూర్లో పశువుల భాష తెల్సిన గుండోడుండాడు. వాడు చెప్పాడు'' అంటూ జనం మధ్యలో నుండి గుండోడ్ని తీసుకొచ్చారు.

వాడు రాగానే ''అంబా'' అన్నాడు. అంతే! చుట్టుపక్కల మేస్తున్న పశువులు 'అంబా' అన్నాయి వాడి గొంతు వినగానే!

పరమానందం పిచ్చిపట్టినట్టు గట్టిగా అరిచి..పశువులను తోలుకురమ్మని గోవిందాన్ని పంపాడు. పశువులతోపాటు స్త్రీలు వచ్చి చెప్పారు ''అయ్యా! ఇవి మా డబ్బుతో మేం కొన్నవండి..మీరిప్పించినవి కావు''.

పరిశీలించాడు గోవిందం. ''సార్! నిజమే సార్! వీటిలో ఏ ఒక్కదానికీ గుర్తుల్లేవ్!''

పరమానందానికి ఏం పాలుపోక లెడ్జర్ బుక్ తీసి లెక్కవేశాడు. లోను ఇచ్చిన మొత్తం పదిలక్షలు దాటింది. అప్పుడే వచ్చిన పోస్టుమెన్ పరమానందం టేబుల్ పై ఓ కవరు విసిరి వెళ్ళాడు. అది హెడ్ ఆఫీసు నుండి మూడు నెలలు ముందు వేసిన ఉత్తరం...ఇప్పుడు చేరింది. అందులో డైరెక్టరు సంతకంతో ఇలా వ్రాసి వుంది.

''మీ చేతులపై కొత్త బ్రాంచీ ఓపెన్ చేస్తున్నందుకు అభినందనలు. పట్నంలో వలే కాదు, పల్లె జనం తెలివిమీరి ఉన్నారు. ఫలానా మినిస్టర్‌గారు పుట్టిన ఊరు. ఆల్ ది బెస్ట్..జాగ్రత్త! గాడ్ బ్లెస్ యూ!'' అని వుంది.

**-రోషన్ మొగల్ (నెల్లూరు)**

# కనువిప్పు

కొత్తగా ఉద్యోగంలో చేరిన మా ఆవిడ తన మొదటి జీతంతో నాకు డ్రెస్ తియ్యడానికి ఉత్సాహపడడంతో ఇద్దరం కలిసి బట్టలషాప్‌కి వెళ్లాం. షాపువాడు ఆనందంగా ఆహ్వానించాడు. లేటెస్ట్ వెరైటీ చూపించాడు. మేం వాటిని పరిశీలిస్తూ ఉండగా ఒక వృద్ధ జంట షాపు మెట్లెక్కడం కనిపించింది.

"నిన్న మీ షాపులో ఈ చీర కొన్నాం గుర్తుందా?" అడిగిందా పెద్దావిడ.

కాస్సేపు గుర్తుపట్టనట్టుగా చూసి, పెద్దాయన రసీదు తీసే ప్రయత్నంలో పడడంతో "ఆ..గుర్తులేకేం" అన్నాడు.

ఆమె ఆ చీర తీసి చూపుతూ "ఇది నిన్న మీ షాపులో కొన్నాం. తీరా ఇంటికి వెళ్లి చూద్దుము కదా చిన్న డామేజ్ ఉంది. ఇది తీసుకుని వేరే చీర ఇవ్వండి" అంది మర్యాదగా.

"డామేజీనా! అబ్బే అలాంటి చీరలు మేం అమ్మమండీ. మీరు సరిగా చూశారో లేదో" అన్నాడు విసురుగా.

"చూడకపోవడమేమిటయ్యా. ఇంటికి వెళ్లగానే మా కోడలు 'ఇలాంటి చీర కొన్నారేమిటీ, వెంటనే తిరిగి ఇచ్చేయండి' అని గొడవ పెట్టింది. మీ షాపులో ఇలాంటి చీరలమ్ముతున్నారని తెలిస్తే నలుగురిలోనూ మీ షాపు పరువుప్రతిష్ఠలకే భంగం కదా" అన్నాడు ఆ ముసలాయన. ఆ మాటల్లో నుతిమెత్తగా తినిపించిన బెదిరింపునకు షాపతను కాస్త తగ్గాడు.

"ఏదీ చూపించండి. వేరేది ఇస్తాను" అన్నాడు.

ఆ దంపతులిద్దరూ వరుసు మీద కూర్చున్నారు. ఎంతసేపు వెదకినా ఎక్కడా డామేజి కనబడడం లేదామెకి. వయసు మీద పడడంతో ఆమెకి చూపు కాస్త మందగించినట్టుంది. దానికితోడు సంధ్యవేళ. షాపులో వెలుగు తక్కువగా ఉంది. మరొకసారి మొదటినుంచి చివరివరకూ వెదకడం ప్రారంభించింది. డామేజీ ఆమెకయితే కనిపించలేదు గానీ దూరంనుంచి చూస్తున్న నాకు మాత్రం స్పష్టంగా కనిపించింది. అది చేనేత జరీ చీర. నేతలో జరిగిన పొరపాటు వల్ల పోగులు పెనవేసుకుపోయి ఉరద చుట్టినట్టుగా ఉందొక చోట. దాని వల్ల ఆచీర అందమంతా పోయింది. అయితే వాళ్లిద్దరూ వృద్ధులే కావడం వల్ల చూపు మసకబారి దాన్ని కనిపెట్టలేకపోతున్నారు. షాపువాడు ఉద్దేశ్యపూర్వకంగానే దాన్ని చూసి కూడా చూడనట్లు నటిస్తున్నాడు.

'నాకు కనిపిస్తోంది కదా పోనీ నేనే వెళ్లి చెబుదామా' అనుకున్నాను. అంతలోనే 'మధ్యలో నేనెందుకు జోక్యం చేసుకోవడం. షాపతనితో నాకు పూర్వ పరిచయం ఉంది. నేను నిజం చెబితే అతని మోసం బయటపడుతుంది కాబట్టి హర్ట్ అవుతాడు. నా మీద ద్వేషం పెంచుకుంటాడు. అతనితో నా సంబంధాన్ని పాడు చేసుకోడమెందుకు. ఆ ముసలావిడ తనంతట తానుగా డామేజీ చూపలేకపోతోంది. కాబట్టి నష్టపోక తప్పదు' అని మనసులోనే అనుకుంటూ మాట్లాడక ఊరుకున్నాను. పాపం వెదకి వెదకి ఆ వృద్ధ దంపతులిద్దరూ విసిగిపోయారు. షాపువాడి ధోరణి మామూలే.

"ఏదీ ఎక్కడండీ డామేజీ. ఎక్కడా లేదే. నేను చెబుతూనే ఉన్నాను కదా. మా షాపులో అలాంటివి అమ్మము అని. మేం క్వాలిటీకి చాలా ప్రాధాన్యం ఇస్తాం. మీరు దేన్ని చూసి ఏదనుకున్నారో!" అన్నాడు.

ఇక లాభం లేదనుకుని వారు ఇంకేమీ మాట్లాడకుండా చీరని కవర్‌లో పెట్టుకుని ముందుకి సాగిపోయారు. మేం కూడా మా బట్టలు ప్యాక్ చేయించుకుని ఇంటిదారి పట్టాం. బండి డ్రైవ్ చేస్తున్నానే గానీ ఆలోచనలన్నీ ఆ వృద్ధ దంపతుల చుట్టూనే తిరుగుతున్నాయి. 'నేను షాపువాడి తప్పుని ఎందుకు ఎత్తి చూపలేకపోయాను? వారి అసహాయతని ఆసరాగా తీసుకుని షాపతను వారిని మోసగిస్తుంటే ఎందుకు వ్యతిరేకించలేదు? నా మంచితనం పోతుందనా? ఎవరో నష్టపోతే నాకెందుకులే అనే ధోరణా?' ప్రశ్నిస్తున్న నా అంతరాత్మ గొంతునొక్కాను. ఇంటికిచేరి గడపదాటగానే మా ఆవిడ కెవ్వుమని అరిచింది. కంగారుపడి చూడబోతే తన కుడిపాదాన్ని పరిశీలనగా చూసుకుంటూ-

"అయ్యో! కాలిపట్టీ కనిపించడం లేదండీ. ఎక్కడ జారిపోయిందో ఏమిటో?" అని హడావిడి చేసింది. అవి కొని వారం కాలేదు. తన పుట్టినరోజు కానుకగా ప్రత్యేకంగా కొత్త మోడల్‌తో తయారుచేయించాను. "అంత అజాగ్రత్త అయితే ఎలా?" అని విసుక్కున్నాను.

"ఎక్కడ పడిపోయి ఉండవచ్చు?" సాలోచనగా అడిగాను.

"ఆ...గుర్తొచ్చిందండీ. బట్టలషాపులో జారిపోయి ఉంటాయి. దాని గొళ్ళెం లూజుగా ఉందని దగ్గరకు నొక్కాను. సరిగా నొక్కుకోలేదు. ఇంటికి పోయాక చూద్దాం అని అలా వదిలేశాను. అనుకున్నట్టే అయింది. అవి షాపులోనే జారిపోయి ఉంటాయి" అనడంతో వెంటనే షాపు దగ్గరకు బయలుదేరాను.

షాపులో ఇందాకటి వృద్ధ జంట మళ్లీ కనబడ్డారు. వారితోపాటు కాన్వెంట్ చదివే చిన్న బాబు కూడా ఉన్నాడు. షాపువాడి మొహంలో అప్రసన్నత చోటుచేసుకుంది. విసుక్కుంటూ మరో చీర వెదుకుతున్నాడు. నాకు విషయం అర్థమైంది. కాన్వెంట్‌నించి ఇంటికి వెళుతున్న మనవడిని తీసుకొచ్చి చీర చూపించారన్నమాట. డామేజిని ఆకుర్రాడు పసిగట్టినట్టున్నాడు అనుకున్నాను. అయితే నా ధ్యానంతా పట్టాల మీదే. షాపులోకి అడుగుపెట్టి "ఏమండీ. ఇందాక మా ఆవిడ, నేను షాపింగ్‌కి వచ్చాం కదా. ఆమె పట్టీలు జారిపోయాయి. ఇక్కడేమైనా కనబడ్డాయా?" అని అడిగాను ఆతృతగా.

"అబ్బే. ఏం కనబడలేదండీ. దారిలో ఎక్కడైనా పడిపోయి ఉంటాయి. సరిగా వెదకండి" అన్నాడు.

"అదేంటంకుల్ అలా అంటావు? ఇందాక నేను వచ్చేసరికి మీరు పట్టీని చేత్తో పట్టుకుని బాగుందని జేబులో వేసుకున్నారు. నేను చూశాను. ఆ అంకుల్ తమవి అంటున్నారు కదా. మరి ఇవ్వరేమిటి?" అని గడుసుగా నిలదీస్తున్నాడు షాపువాడ్ని ఆ ఆరేళ్ల కుర్రాడు.

ఆ మాటలతో షాపువాడికి గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. తల వంచుకుని "క్షమించండి సార్" అంటూ ఆ పట్టీలు తిరిగి ఇచ్చేశాడు నాకు. "వెరీ గుడ్ బాయ్! అలా ఉండాలి పిల్లలంటే. నీలా నిజం చెప్పడానికి ఎప్పుడూ భయపడకూడదు బాబూ! కీపిటప్" అని ఆ బాలుడి వెన్నుతట్టాను. అంతేకాదు నేను కూడా ఇకనుంచీ ఎప్పుడూ నిజం చెప్పడానికి భయపడకూడదని నిర్ణయించుకున్నాను. వయసులో చిన్నవాడైనా ప్రవర్తనలో ఉన్నతంగా నిలిచిన ఆ బాలుడికి మనసులోనే జోహార్లు అర్పించుకున్నాను.

**-చైతన్య (గాంధీనగర్)**